

# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

ఆదివారం 9-7-2023

teluguprabha.net -TeluguPrabha @TeluguPrabhaofficial


# శివాలెత్తిన సికింద్రాబాద్

కోలాహలంగా అమ్మవారి బోనాలు

తొలి బోనం సమర్పించిన మంత్రి తలసాని కుటుంబం

**తెలుగుప్రభ,హైదరాబాద్(జూలై9):**

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీమహంకాళి అమ్మవారి ఓబోనాల వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెల్లవారుజామున కుటుంబసభ్యులతో కలిసి ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు, తొలి బోనం సమర్పించారు. ఆలయ పండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. బోనాలతో పాటు అన్ని పండుగలనూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఘనంగా నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ ఏర్పడ్డాకే ముఖ్యమంత్రి కేసీఆర్ బోనాలను రాష్ట్రపండుగగా ప్రకటించారని గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పాటైన నాటినుంచి ప్రభుత్వం బోనాల ఉత్సవాలు ఘనంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. పండుగను ఘనంగా జరుపుకోవడానికి అన్ని దేవాలయాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని, ప్రైవేట్ దేవాలయాలకు సైతం ఆర్థిక సహాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం దేశంలో తెలంగాణ మాత్రమేనన్నారు. బోనాల సందర్భంగా ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లుచేసినట్లు చెప్పారు గత రెండు నెలల నుంచి అన్ని ప్రభుత్వ యంత్రాంగాలు బ్రహ్మాండంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఆదివారం బోనాలు, సర్వదర్శనం, సోమవారం సర్వదర్శనం, రంగం, ఘటోత్సవాలు, అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరుగనున్నట్లు తెలిపారు.

వచ్చే ఆదివారం ఉమ్మడి దేవాలయాలతోపాటు నగరంలోని మిగతా అన్ని దేవాలయాల్లో బోనాల ఉత్సవాలు జరుగుతాయన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా తదితర దేశాలతో పాటు దేశంలోని ముంబై ఇతరత్రా నగరాల్లో మహంకాళి జాతర జరుపుకుంటుండటంతో విశ్వవ్యాప్తమైందన్నారు.





### భక్తుల తాకిడి..

తెల్లవారు జామునుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. భక్తుల కోసం ఆరు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. దాదాపు రెండువేలమంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

## లేటెస్ట్ న్యూస్



## సాయిచంద్ కు కేసీఆర్ నివాళి

**తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 8)**

బీఆర్ఎస్ నేత, తెలంగాణ ఉద్యమకారుడు సాయిచంద్ ఇటీవల గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. సాయిచంద్ దశదిన కర్మ సాగర్ రోడ్డులోని బిఎస్ఆర్ కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు. సాయిచంద్‌కు నివాళులు అర్పించారు. ఆయన కుటుంబాన్ని ఓదార్చి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కేసీఆర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలు హాజరయ్యారు.

## సిర్పూర్ నుంచి పోటీ : ఆర్ఎస్పీ ప్రవీణ్



**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై9) :**

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తాను సిర్పూర్ నుంచి పోటీ చేయనున్నట్లు బహుజనసమాజ్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. నియోజకవర్గ ప్రజలు తనకు అండగా ఉండి కేంద్రం,రాష్ట్రంలో అధికారాల్లో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించాలని విజ్ఞప్తిచేశారు. సిర్పూర్ ఎమ్మెల్యే కోనప్ప అనుచరులు రాజ్యాంగేతర శక్తులుగా మారి అధికారులపై దాడులకు పాల్పడుతున్నారన్నారు.వారి ఆటలు ఇక ఎంతోకాలం సాగవన్నారు.

## వారంతా సేఫ్

జమ్ము శ్రీనగర్ హైవే లో కొండ చరియలు విరిగిపడి పలు ప్రాంతాల్లో అమర్నాద్ యాత్రికులు చిక్కుకుపోయారు. మార్గమధ్యంలో చిక్కుకున్న వారిని సీఆర్పీఎఫ్ జవాన్ల బృందం సురక్షితంగా రక్షించి తమ బేస్ క్యాంప్‌కి తరలించారు. ఐదు రోజులు క్రితం భైంసా పట్టణానికి చెందిన 10 కుటుంబాలు అమర్నాథ్ యాత్రకు వెళ్లారు. అయితే యాత్ర కొనసాగే జమ్ము – శ్రీనగర్ హైవే మార్గంలో భారీ వర్షాలు కురియడంతో కొండ చరియలు విరిగి పడ్డాయి.. దీంతో కొంత మంది యాత్రీకులు మధ్యలోనే చిక్కుకుపోయారు. ఇదే యాత్రకు వెళ్లిన భైంసా యాత్రీకుల బృందం సైతం చిక్కుకపోగా అక్కడి మార్గంలోని సీఆర్పీఎఫ్ జవాన్లు వారిని సురక్షితంగా రక్షించి బల్తాల్ బేస్ క్యాంప్‌కు తరలించారు.





# పాలికాబజార్‌లో అగ్నిప్రమాదం

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై8):**

సికింద్రాబాద్ పాలికాబజార్‌లో ఆదివారం ఉదయం బట్టల దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఈ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక విభాగం నుంచి 4 ఫైర్ వాహనాలు, జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ నుంచి ఒక జేసీబీ వాహనంతో పాటు మూడు డీఆర్ఎఫ్ బృందాలు అక్కడకు చేరుకొని దుకాణంలో ఉన్న వారందరినీ బయటకు తరలించినట్లు జీహెచ్ఎంసీ ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌స్ సంఘటనాస్థలానికి చేరుకున్నారు. తీసుకోవాల్సిన చర్యలపై జోనల్ కమిషనర్ రవికిరణ్, ఇతర అధికారులకు సూచనలిచ్చారు. జీహెచ్ఎంసీ, పోలీసు విభాగాలు సమన్వయంతో మంటలను అదుపులోకి తెచ్చాయి. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. మంటలు ఆర్పినప్పటికీ, ఈ ప్రాంతంలో ఇంకా పొగ అలముకొని ఉంది. ఈ ఘటనపై అధికారులు విచారణ జరుపుతున్నారని, సాయంత్రానికి వివరాలు తెలుస్తాయని మంత్రి తెలిపారు. నగరంలో అగ్ని ప్రమాదా నివారణకు ఇప్పటికే ఒక కమిటీ వేశామన్నారు. కొన్ని సంఘటనలు అనూహ్యంగా జరుగుతున్నందున విచారణ చేయాల్సి వస్తోందన్నారు.

### డిప్యూటీ మేయర్ సందర్శన



ప్రమాదం సమాచారం తెలుసుకున్న వెంటనే గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతె శ్రీలత శోభన్ రెడ్డి హటాహుటిగా స్థలానికి చేరుకొని, అధికారులతో అడిగి ఈ సంఘటన షాట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగాయని అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను గద్దె దింపేది తామేనని బీజేపీ, కాంగ్రెస్‌లు కలలు కంటున్నాయి. కర్నాటకలో దక్కిన గెలుపుతో కాంగ్రెస్‌కు పట్టపగ్గాల్లేకుండా పోయాయి. కేంద్రంలో రెండుసార్లు గెలిచిన తాము ఈసారి రాష్ట్రంలోనూ కాషాయ పతాకాన్నెగురవేస్తామని బీజేపీ నేతలు భ్రమ పడుతున్నారు. ఇతర పార్టీల నుంచి ఒకరో ఇద్దరో నేతలు తమ పార్టీలో చేరేందుకు ముందుకొస్తుండటంతో రెండు పార్టీలూ ఇక తమకు తిరుగేలేదని భావిస్తున్నాయి.

**తెలుగుప్రభ, హైదరాబాద్(జూలై7):**




# ఇంటి పోరు

## ఇంతింత కాదయా..

బీజేపీ, కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలు

గళమెత్తుతున్న బీసీలు, దళితులు

ఇంట్లో ఈగల మోత ఉన్నా..

బయట పల్లకీలపై మోజు

అనూహ్యంగా వచ్చిన వాపును చూసి బలుపనుకుంటున్న రెండు పార్టీలు అసలు వాస్తవాన్ని గ్రహించడం లేవు. రెండు పార్టీల్లోనూ ఇప్పటికే అంతర్గత విభేదాల అగ్గి రాజుకుంది. అది ఎప్పుడైనా భగ్గుమనవచ్చు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కీలకతరుణంలో ఇంటిలోని అసమ్మతులను తొలగించుకోలేని పార్టీలు బీఆర్ఎస్‌ను ఎలా ఢీకొంటాయో వాటికే తెలియాలి.

### తీవ్రమవుతున్న ధిక్కార స్వరాలు..

బీఆర్ఎస్ నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావులు తమ పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేయడంతోనే కాంగ్రెస్ గాల్లో మేడలు కట్టడం మొదలు పెట్టింది. వాస్తవానికి బీఆర్ఎస్‌లో ఉంటే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు టిక్కెట్లు రావని గ్రహించినందునే వారు కాంగ్రెస్‌వైపు కన్నేశారు. ఈనేపథ్యంలో వారి బలమెంత.. వారివల్ల పార్టీకి కలిగే ప్రయోజనమెంత ? అన్నది ఆలోచించలేదు. మరోవైపు పార్టీలో ఇప్పటికే రాజుకున్న, రోజురోజుకూ తీవ్రమవుతున్న అసంతృప్తుల్ని, ధిక్కార స్వరాల్ని అడ్డుకునే పనిచేయలేకపోతోంది. పార్టీ మండల, డివిజన్,బ్లాక్‌స్థాయి అధ్యక్షుల నియామకాల్లో తమ వారికి పదవులు రాకుండా చేశారని నల్లగొండ,రంగారెడ్డి, తదితరజిల్లాలకు చెందిన కాంగ్రెస్ నేతలు గాంధీభవన్‌లో గందరగోళం సృష్టించారు. ఏ పార్టీలోనైనా పోలింగ్‌స్థాయిలో పనిచేసే

స్థానిక నేతల అసంతృప్తి ఆపార్టీకి చేటు చేస్తుందనడం తెలియంది కాదు. బీజేపీలోనూ ఇప్పటికే అంతర్గత వార్ మొదలవడం తెలిసిందే. ఆ పార్టీ పాత, కొత్త అధ్యక్షులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి కలిసి ఉన్నట్లు ఫొటోలకు ఫోజులిచ్చినా క్యాడర్‌లో ఆ పరిస్థితి లేదు. మరోవైపు రఘునందన్ సొంత నియోజకవర్గంలోనే స్థానిక నేతలు తిరుగుబావుటా ఎగురవేశారు. తన మొహం చూసే ఓట్లేశారనడంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### బడుగులపై చిన్నచూపు

కాంగ్రెస్‌లో బీసీలకు తగిన పదవులివ్వడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య చేసిన వ్యాఖ్యలకు బీసీ సంఘాల నేతలు మద్దతు ప్రకటించారు. బీసీల వాణి కేవలం కాంగ్రెస్‌కే పరిమితం కాలేదు. బీసీ ప్రధానిగా ఉన్న బీజేపీలోనూ బీసీలకు న్యాయంజరగడం లేదని బీసీ సంఘాల నేతలు ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్‌గౌడ దాసు సురేశ్ తదితరులు తమ గళాన్ని వినిపిస్తూ బహిరంగలేఖలు విడుదల చేశారు. బండి సంజయ్‌ను తప్పించడం కూడా బీసీలను ఎదగనీయకుండా చేయడమేనన్న వారూ ఉన్నారు. మరోవైపు దళితులను కూడా చిన్నచూపు చూస్తున్నారనే వాదనలున్నాయి. దళితుడైనందునే మల్లు భట్టి విక్రమార్కకు గుర్తింపు రాకుండా చేసేందుకే ఆయన పాదయాత్ర ముగింపు సభలో పొంగులేటి చేరికను కలిపారని దళితులు భావిస్తున్నారు. అంతేకాదు.. ఆ సభలో రాహుల్ పక్కన ఫొటోల కోసం తోసుకోవడాల్నీ ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. మరోవైపు రాబోయే ఎన్నికల్లో భట్టిని ఓడించేందుకు సొంతపార్టీవారే ప్రయత్నిస్తున్నారనే గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్, బీజేపీలు తమ ఇంటినే చక్కదిద్దుకోకుండా బీఆర్ఎస్‌ను ఎలా ఓడిస్తాయో వాటికే తెలియాలి!

## వారెవ్వా.. టమాట !

– పెరిగిన ధరలతో విచిత్ర ఆఫర్లు

**తెలుగుప్రభ,హైదరాబాద్(జూలై8):**

టమాటా ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో బర్గర్లలో టమాటాను ఎత్తేయడం తెలిసిందే. తాజాగా మధ్యప్రదేశ్‌లోని అశోక్‌నగర్ సిటీలో అభిషేక్ అగర్వాల్ అనే యువ వ్యాపారి తనవద్ద స్మార్ట్‌ఫోన్లు కొనే వారికి రెండుకిలోల టమాటాలు గిఫ్ట్‌గా ఇవ్వనున్నట్లు బోర్డు పెట్టడంతో జనం క్యూ కడుతున్నారు. ప్రజలు ప్రతినిత్యం వినియోగించే టమాటా ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో కొనలేకపోతున్నారు. మొబైల్ ఫోన్లు కొనుగోలు చేయాలనుకునేవారికి ఈ ఆఫర్ ఉంటే తనవద్దకే వస్తారనే ఆలోచనతో ఆయన వేసిన ప్లాన్ బాగానే పనిచేస్తోంది.

